మోడీ, షాలకు బెదిరేది లేదు

- సోనియా, రాహుల్‌కు అండగా నిలుద్దాం
- బాధ్యతల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు
- టిపిసిసి విస్తృతస్థాయి సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి



టిపిసిసి విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్, పక్కన మంత్రులు తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓట్ చోరీ అంశం నుంచి దేశ ప్రజల దృష్టి మరల్చేందుకే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తమ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌పై మళ్లీ మళ్లీ అక్రమ కేసులు బనాయిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. ఈ నేపథ్యంలో వారిరువురికి అండగా నిలుద్దామంటూ ఆయన పిలుపునిచ్చారు. కేసులకు అదిరేది లేదు.. మోడీ, అమిత్ షాలకు బెదిరేది లేదని ఆయన ఘాటుగా హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన టిపిసిసి విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సిఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, కార్యదర్శులు విశ్వనాథన్, సచిన్ సావంత్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, వాకాటి శ్రీహరి, అజహరుద్దీన్, నూతనంగా నియమితులైన డిసిసి అధ్యక్షులు, టిపిసిసి ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా సీఎం..డిసిసి అధ్యక్షులకు, ఇతర నాయకులకు పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. మోడీ సర్కార్ తమ పార్టీ పట్ల అనుసరిస్తోన్న కక్షపూరిత వైఖరిని ఆయన ఎండగట్టారు. పంచాయతీ ఎన్నికలు, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవాలు, గ్లోబల్ సమ్మిట్, ఇందిరమ్మ చీరెల పంపిణీ, ఇతర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లటంపై ఆయన వారికి మార్గదర్శనం చేశారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన ఘనత గాంధీ కుటుంబానిదని చెప్పారు. సొంత ఆస్తులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను ప్రారంభించిన ఆ కుటుంబం దేశ స్వాతంత్ర్యోద్యమంలో కీలకపాత్ర పోషించిందని గుర్తు చేశారు. ఆ పత్రికకు సంబంధించిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునేందుకు, ఆర్థికంగా నిలబెట్టేందుకు సోనియా గాంధీ, రాహుల్ కృషి చేశారని తెలిపారు. తిరిగి ఆ పత్రికను పునరుద్ధరించడానికి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు అవసరమైనప్పుడు మల్లికార్జున ఖర్గే లాంటి కాంగ్రెస్ ముఖ్య నాయకులను డైరెక్టర్లుగా నియమించటం ద్వారా పత్రికను పునరుద్ధరించారని వివరించారు. ఇందులో ప్రభుత్వానికి సంబంధించిన ఏ ఒక్క రూపాయి లేదని స్పష్టం చేశారు. నెహ్రూ వారసత్వంగా వచ్చిన ఆస్తులతో పత్రికను నడిపితే..దీనిపై మనీ ల్యాండరింగ్ కేసు పెట్టి సోనియా గాంధీ, రాహుల్‌ను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారని సిఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ అంశం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే కేసుల పేరుతో మళ్లీ ఇప్పుడు హడావుడి చేస్తున్నారని దుయ్యబట్టారు. సోనియా గాంధీ, రాహుల్‌పై కేంద్రం బనాయించిన అక్రమ కేసును తీవ్రంగా ఖండిస్తూ సిఎం తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తమ ప్రభుత్వం రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే వాటిని ఇంటింటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత డిసిసి అధ్యక్షులు, నాయకులపై ఉందన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, కోటి మంది ఆడ బిడ్డలకు కోటి చీరలను సారెగా అందిస్తున్నామని చెప్పారు. ప్రతీ ఆడబిడ్డకు చీర చేరేలా చూడాల్సిన బాధ్యత పార్టీ జిల్లా అధ్యక్షులదేనని అన్నారు. గ్రామలవారీగా సమన్వయం చేసుకుంటూ వాటి పంపిణీని పూర్తి చేయాలని కోరారు. డిసెంబర్‌లోగా గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల చీరల పంపిణీ పూర్తి కావాలని, మార్చిలో పట్టణ ప్రాంతాల్లో 35 లక్షల చీరలను పంపిణీ చేయాలని సూచించారు.

పెండింగ్ పదవులను భర్తీ చేస్తాం : మహేశ్ కుమార్ గౌడ్

పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... వారం పది రోజుల్లో ఖాళీగా ఉన్న కార్పొరేషన్ పదవులతోపాటు పెండింగ్‌లో ఉన్న ఇతర పదవులనూ భర్తీ చేస్తామని వెల్లడించారు. జిల్లాల్లో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉందన్నారు. డిసిసి అధ్యక్షుల ఎంపికలో నిష్పాక్షికంగా వ్యవహరించామని మీనాక్షి నటరాజన్ చెప్పారు. నూతన జిల్లా అధ్యక్షులకు జనవరిలో శిక్షణా శిబిరాలను నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

7నుంచి 9 వరకు సిఐటియు రాష్ట్ర మహాసభ

- వేలాదిగా తరలి రండి : పాలడుగు, చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఐటియు రాష్ట్ర ఐదో మహాసభలు 7 నుంచి 9వరకు మెదక్ పట్టణంలో జరుగనున్నాయి. 7న బహిరంగ సభ నిర్వహిస్తున్నామనీ, ఆ సభలో కార్మిక నేతలు పాల్గొనున్నారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ తెలిపారు. బహిరంగ సభకు కార్మికులు పెద్దఎత్తున కదలి రావాలని పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర కేంద్రం కార్యకర్తల సమావేశంలో మహాసభల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభల ప్రారంభ రోజున మెదక్ పట్టణంలో బహిరంగసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభకు ముఖ్యవక్తగా సిఐటియు ఉమ్మడిరాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సిఐటియు అఖిల భారత అధ్యక్షులు కె.హేమలత, జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని చెప్పారు. మహాసభను అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ ప్రారంభిస్తారని తెలిపారు. రాష్ట్రంలోని సోదర కార్మిక సంఘాల నేతలు హాజరై తమ సౌహార్ద సందేశాలను ఇస్తారన్నారు. మహాసభ నిర్వహణకు జిల్లాల్లో అసంఘటిత రంగ కార్మికుల నుంచి, స్కీం వర్కర్లతోపాటు ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సభలకు వచ్చే ప్రతినిధులకు బస ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. కీలకమైన సందర్భంలో ఈ మహాసభలు జరుగుతున్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మొత్తం కార్మిక వర్గానికి ఉచ్చు బిగించిందనీ, దీన్ని ప్రతిఘటించాల్సిన అవశ్యకత కార్మిక వర్గం ముందున్నదని గుర్తు చేశారు. యాజమానుల, కార్పొరేట్ల గరిసెల్లోకి లాభాల వరద పారించేందుకే లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చిందని విమర్శించారు. కార్మిక హక్కులను తుంగలో తొక్కుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై సమరశీల పోరాటాలకు కార్మికులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయకుండా తిరస్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభల్లో రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ, భూపాల్, విఎస్ రావు, రాష్ట్ర కార్యదర్శులు ఎం పద్మశ్రీ, వి శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, పి సుధాకర్, ఎ సునిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి అప్పుల్లోకి నెట్టిన సర్కారు

- ఇయు విమర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసిని కాంగ్రెస్ ప్రభుత్వం మరింత అప్పుల ఊబిలోకి నెట్టివేస్తోందని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఈదురు వెంకన్న ఆరోపించారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా జారీ చేసిన జీరో టికెట్లకు సంబంధించి ప్రతినెలా రూ.350 కోట్లు ఆర్టీసీకి చెల్లిస్తామని హామీ ఇచ్చి, అరకొర నిధులను విడుదల చేస్తున్నారని విమర్శించారు. ఆర్‌టిసికి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ. 8,700 కోట్లకుగాను, కేవలం రూ. 6,620 కోట్లే విడుదల చేసి మొత్తం చెల్లించినట్టుగా ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నదన్నారు. కానీ చెల్లించాల్సిన సొమ్ము సుమారు రూ.2,072 కోట్లు ఇవ్వకుండా, ఆ భారాన్ని ఆర్టీసీ మీదనే ప్రభుత్వం రుద్ది చేతులు దులుపుకోవడం సమంజసం కాదన్నారు. అలాగే ఉద్యోగులకు చెల్లించాల్సిన 2017 వేతన సవరణ బకాయిలు, 2021, 2025 వేతన సవరణలు అమలుకు నోచుకోవడంలేదని తెలిపారు. రిటైరైన ఉద్యోగులు క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీలో పొదుపు చేసుకున్న మొత్తాలకు చెల్లించాల్సిన వడ్డీ 15 నెలలుగా చెల్లించకపోవడం వలన కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్‌టిసికి చెల్లించాల్సిన మొత్తం రూ. 2,072 కోట్లను తక్షణమే విడుదల చేయాలని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రాజ్‌భవన్ ఇక నుంచి "లోక్‌భవన్"

- నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రాజ్‌భవన్ పేరును లోక్‌భవన్‌గా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. వలసవాద వాసనలను తుడిచిపెట్టేందుకు.. రాజ్‌భవన్, రాజ్ నివాస్‌ల పేర్లను లోక్‌భవన్, లోక్‌నివాస్‌లుగా మార్చే అంశాన్ని పరిశీలించాలని గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లకు సూచిస్తూ ఇటీవల కేంద్ర హోంమంత్రిత్వ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖ రాసింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం రాజ్‌భవన్ పేరును లోక్‌భవన్‌గా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ గవర్నర్ అధికారిక నివాసం 'రాజ్‌భవన్ ఇకపై 'లోక్‌భవన్‌గా పిలవబడుతుందని తెలిపింది. వికసిత్ భారత్ వైపు ముందుకు సాగుతున్న సమయంలో దేశ ప్రజాస్వామ్య విలువల బలాన్ని, చైతన్యాన్ని పునరుద్ఘాటించడానికి ఈ నిర్ణయం తీసుకోబడిందని పేర్కొంది. సైన్‌బోర్డులు, అధికారిక వెబ్‌సైట్లు, లెటర్‌హెడ్‌లలో తక్షణమే ఈ మార్పు అమల్లోకి వస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

భూదందా కోసమే హిల్ట్ పాలసీ

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూదందా కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం హిల్ట్ పాలసీని తెచ్చిందని.శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ దాదాపు పదివేల ఎకరాల ప్రభుత్వ భూములను కారు చౌకగా కట్టబెట్టేందుకే ఈ పాలసీ తెచ్చారని అన్నారు. కేవలం 45 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసి డబ్బులు దండుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. పరిశ్రమలకు భూములు ఇచ్చేటపుడే కాదు అమ్మేపుడు కూడా ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని డిమాండ్ చేశారు. పర్యావరణ వేత్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. లీజు భూములకు హిల్ట్ పాలసీ వర్తించబోదని మంత్రి శ్రీధర్ బాబు చెబుతున్నారని అన్నారు. హిల్ట్ పాలసీ రావడానికి వెనుక రూ.వేల కోట్ల రహస్య ఒప్పందాలున్నాయని ఆరోపించారు. హిల్ట్ పాలసీని రద్దు చేసి పారిశ్రామిక భూములు వేలం వేయాలని డిమాండ్ చేశారు. హిల్ట్‌కు వ్యతిరేకంగా తమ పోరాటాన్ని ఢిల్లీ దాకా తీసుకెళ్తామన్నారు. ప్రభావిత ప్రాంతాల పర్యటనకు ఎనిమిది నిజనిర్ధారణ బృందాలను పార్టీ నియమించిందని చెప్పారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్ అవతారమెత్తారని విమర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డితో ఎవరు కుమ్మక్కయినా హిల్ట్‌పై వదిలిపెట్టేది లేదన్నారు. భూ దందాలతో దోచుకో దాచుకో అనే విధానంపైనే రేవంత్‌రెడ్డి దృష్టిపెట్టారని మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు.

రెండో విడత సర్పంచ్ నామినేషన్లు 12,479

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండో దశ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పర్వం సోమవారం అర్థరాత్రి వరకు కొనసాగింది. రెండో రోజు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. రాష్ట్రంలో 193 మండలాల్లోని 4,332 పంచాయతీలు, 38,342 వార్డులకు నిర్వహిచే ఎన్నికలకు సంబంధించి దాఖలైన నామినేషన్ల వివరాలను ఎన్నికల సంఘం అధికారులు సోమవారం వెల్లడించారు. మొదటి రోజు 2,976, రెండో రోజు 9,503 కలిపి మొత్తం సర్పంచ్ పదవి కోసం 12,479 నామినేషన్లు, వార్డు స్థానాలకు 30,040 నామినేషన్లు దాఖలయ్యాయి. సర్పంచ్ పదవికి అత్యధికంగా నల్లగొండలో 883, ఆ తర్వాత సిద్దిపేటలో701, అత్యల్పంగా ములుగులో 113, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లాలో 190 నామినేషన్లు దాఖలయ్యాయి. 38,342 వార్డు స్థానాలకు గాను 30,040 నామినేషన్లు వచ్చాయి. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 2,070, ఆ తర్వాత సంగారెడ్డి జిల్లాలో 1,996, అత్యల్పంగా జోగులాంబ గద్వాల జిల్లాలో 341, ఆ తర్వాత నాగర్ కర్నూల్ జిల్లాలో 354 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండో విడత నామినేషన్ల దాఖలుకు నేడు చివరి రోజు కాగా, బుధవారం వాటిని రిటర్నింగ్ అధికారులు పరిశీలించి గురువారం వెల్లడిస్తారు. కాగా రెండు రోజుల్లో సర్పంచ్ స్థానాలకు సగటున మూడు వరకు, వార్డు మెంబర్లకు ఒకటి కంటే తక్కువ నామినేషన్లు దాఖలయ్యాయి. కాగా బుధవారం మొదటి విడుత నామినేషన్ల ఉపసంహరణ అనంతరం తుది జాబితాను ప్రకటించి, గుర్తులను కేటాయిస్తారు.

గ్లోబల్ సమ్మిట్ పనుల్లో వేగం పెంచండి

- అధికారులకు ఉపముఖ్యమంత్రి భట్టి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు సంబంధించి హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన వార్‌రూమ్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మంగళవారం సందర్శించారు. అధికారులకు సూచనలు ఇచ్చారు. విజన్ డాక్యుమెంట్ రూపకల్పనతోపాటు ఈ నెల ఎనిమిది, తొమ్మిది తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ సమ్మిట్ విజయవంతానికి ఏర్పాటు చేసిన కమిటీలు, వాటి పనితీరు, ప్రగతి తదితర అంశాలను కూలంకుషంగా చర్చించారు. గ్లోబల్ సమ్మిట్ విజయవంతానికి ఏర్పాటుచేసిన ఇన్విటేషన్, హాస్పిటాలిటీ, వేదిక, లాజిస్టిక్స్, ట్రాన్స్‌పోర్ట్, ప్రోగ్రాం, కల్చరల్ ఈవెంట్స్, కమ్యూనికేషన్, డిజిటల్ మీడియా కమ్యూనికేషన్ కమిటీల అధ్యక్షులు, సభ్యులతో ప్రత్యేకంగా భేటీ అయి సమీక్షించారు. అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం ప్రతి విభాగంలో పనిచేస్తున్న బృంద సభ్యులతో ఉప ముఖ్యమంత్రి ప్రత్యేకంగా వారి వద్దకు వెళ్లి మాట్లాడి పనులు జరుగుతున్న తీరును, వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో వేగం పెంచడంతోపాటు నాణ్యత, స్పష్టత ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వార్ రూమ్‌ను సందర్శించిన విషయం తెలిసిందే. బుధవారం నుంచి మంత్రులు సైతం వార్‌రూమ్‌ను సందర్శించి జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధికారులు సవ్యసాచి ఘోష్, సంజయ్ కుమార్, సందీప్ కుమార్ సుల్తానియా, అజిత్ రెడ్డి, ప్రభుత్వ మీడియా సలహాదారు శ్రీరామ్ కర్రీ తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీలు అమలు చేయనందుకు విజయోత్సవాలా?

- ప్రభుత్వానికి మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పది శాతం పనులు పూర్తి చేస్తే పూర్తయ్యే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదో సిఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని మాజీమంత్రి వి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలను అమలు చేయనందుకు కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు చేసుకుంటున్నదా?అని ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు హామీలిచ్చి మోసం చేసినందుకా?, డిక్లరేషన్లు అమలు చేయనందుకా?, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎగ్గొట్టినందుకా?, రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వనందుకా?, రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు తేనందుకు సంబురాలు చేసుకుంటున్నారా?అని ప్రశ్నించారు. సీఎం ఫుట్ బాల్ ఆడినా, మంత్రులందరూ ఆడినా తమకు అభ్యంతరం లేదని అన్నారు. కానీ ఇచ్చిన హామీలు అమలు చేసి ఆటలు ఆడుకోవాలని సూచించారు. ఇకనైనా హామీలు అమలు చేయడంపై దృష్టి సారించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నిర్వహించిన విజయోత్సవాల మొదటి సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని అన్నారు. హామీలు అమలు చేయనందుకే సిఎం సభకు జనాలు రావడం లేదన్నారు. రామోజీ ఫిలిం సిటీ ఉండగా ఇంకా వేరే ఫిలింసిటీలు ఎందుకని ప్రశ్నించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఒక్క కోటి రూపాయల పనైనా చేశారా? అని ప్రశ్నించారు. రూ.కోటి పని జరిగిందని చూపిస్తే దేనికైనా సిద్ధమని ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, బిఆర్ఎస్ నేతలు సుమిత్రానంద్, సుశీలా రెడ్డి పాల్గొన్నారు.

మైనింగ్ వ్యర్థాల నుంచి రేర్ ఖనిజాల వెలికితీత

- సిఎస్ఐఆర్-ఐఎంఎంటితో సింగరేణి ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి వ్యాప్తంగా ఉన్న బొగ్గు మైనింగ్ వ్యర్థాల నుంచి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, ఇతర కీలక ఖనిజాలను అన్వేషించి వాటిని వెలికి తీసేందుకు ప్రముఖ పరిశోధన సంస్థలు సిఎస్ఐఆర్, ఐఎంఎంటీతో సంయుక్త భాగస్వామ్యం ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ సమక్షంలో ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభించేందుకు ఇరుపక్షాలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశాయి. సింగరేణి ప్రాంతాల్లో షేల్, మట్టి, సాండ్‌స్టోన్, గ్రానైట్ రాళ్లు, బొగ్గు ఫ్లై యాష్, బాటమ్ యాష్‌లలో నిక్షిప్తమై ఉన్న కీలక ఖనిజాలను రెండు సంస్థలు వెలికితీయనున్నాయి. ఖనిజ రంగంలో పరస్పర సహకారం కోసం ఈ ఏడాది జూన్‌లో తొలుత ఒక అవగాహన కుదుర్చుకున్నామనీ, తాజా ఒప్పందంతో ఈ ప్రాజెక్టు ప్రారంభానికి బలమైన ముందడుగు పడిందని .బలరామ్ పేర్కొన్నారు. సింగరేణి ఓపెన్ కాస్ట్‌ల్లోని కొన్ని గనుల్లో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించబడిందనీ, అలాగే థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి సందర్భంగా విడుదలయ్యే ఫ్లై యాష్‌లో కూడా వీటిని కనుగొనడం జరిగిందని అన్నారు. మణుగూరు సమీపంలోని దుర్గం గుట్ట బ్లాకులో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిర్ధారించిందని తెలిపారు. సింగరేణి విస్తరించి ఉన్న ప్రాంతంలో 14 రకాల ఖనిజాల ఉనికి కనుగొనబడిందని చెప్పారు. వీటిలో లాంథనం, సీరియమ్, ప్రసియోడీమియం వంటి 6 రకాల లైట్ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, అలాగే ఇట్రియం, స్కాండియం, డిస్ప్రోజియం వంటి 8 రకాల హెవీ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నాయన్నారు. వీటి పరిశీలన, విశ్లేషణ, లాభదాయకత శాతాన్ని ఐఎంఎంటి సంస్థ నిర్ధారణ మేరకు ఉత్పత్తి ప్రక్రియను ప్రారంభిస్తామని అన్నారు. ఐఎంఎంటీ డైరెక్టర్ డాక్టర్ రామానుజ నారాయణ్ మాట్లాడుతూ భారతదేశంలో గ్రీన్ టెక్నాలజీకి అవసరమైన రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, క్రిటికల్ మినరల్స్ భద్రత దిశగా ఇది గొప్ప ముందడుగన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎంటి చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ కాళీ సంజయ్, సింగరేణి డైరెక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఎస్‌టిపిపి ఇడి చిరంజీవి, కో ఆర్డినేషన్ జిఎం టి శ్రీనివాస్, జనరల్ మేనేజర్ బి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

గ్లోబల్ సమ్మిట్‌కు అన్ని రాష్ట్రాల సిఎంలకు ఆహ్వానాలు

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం.. అందించనున్న మంత్రులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు అన్ని రాష్ట్రాల సిఎంలను ప్రత్యేకంగా ఆహ్వానించాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. రాష్ట్ర మంత్రులు స్వయంగా వెళ్లి వారిని ప్రత్యేకంగా కలిసి సదస్సుకు ఆహ్వానిస్తారు. ఈ నెల 4న మంత్రులు ఆయా రాష్ట్రాలకు వెళ్లి డిసెంబర్ 8, 9 తేదీల్లో జరిగే సమ్మిట్ ఆహ్వాన లేఖలు అందిస్తారు. ఎవరెవరు ఏఏ రాష్ట్రాలకు వెళ్లాలో సీఎం మంగళవారం ఖరారు చేశారు. జమ్మూ కాశ్మీర్, గుజరాత్‌కు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పంజాబ్ ,హర్యానాకు దామోదర రాజనర్సింహ, ఆంధ్రప్రదేశ్‌కు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కర్ణాటక, తమిళనాడుకు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తర ప్రదేశ్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజస్థాన్‌కు పొన్నం ప్రభాకర్ అందిస్తారు. అలాగే చత్తీస్‌గడ్ కొండా సురేఖ,

పశ్చిమ బెంగాల్‌కు సీతక్క, మధ్యప్రదేశ్ తుమ్మల నాగేశ్వరరావు,
అస్సాం జూపల్లి కృష్ణారావు, బీహార్ వివేక్ వెంకటస్వామి

ఒడిశా వాకిటి శ్రీహరి, హిమాచల్ ప్రదేశ్ అడ్లూరు లక్ష్మణ్‌కుమార్, మహారాష్ట్రకు మహమ్మద్ అజారుద్దీన్ ఆహ్వాన లేఖలను అందిస్తారు. కాగా ఢిల్లీ సీఎం, కేంద్ర మంత్రులు, గవర్నర్లకు రాష్ట్రానికికి చెందిన ఎంపీలు ఆహ్వానం అందించనున్నారు.

భవిష్యత్ తరాలకు ఫ్యూచర్ సిటీ

- గ్లోబల్ సమిట్ పనులు పరిశీలించిన మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భవిష్యత్తు తరాలకు ఫ్యూచర్ సిటీని అందించడంతోపాటు మెరుగైన అభివృద్ధి కోసమే గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్టు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌కు వచ్చే అతిథులకు ఏర్పాటు చేసిన స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన పనుల వివరాలు, ఏర్పాట్లు, చేయాల్సిన పనులు, తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు మంత్రి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ విదేశాల నుంచి వచ్చే వివిఐపిలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. అధికారులు ఎప్పటికప్పుగు పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ ప్రారంభానికి సమయం తక్కువగా ఉన్నందున అన్ని రకాల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరానికి సరిపడా సిబ్బందిని సైతం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫోర్త్ సిటీ ఇన్‌చార్జి, కమిషనర్ శశాంక్, ఎమ్మెల్యే మాల్‌రెడ్డి రంగారెడ్డి, కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్, టీపీసీసీ కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, మాజీ జడ్‌పిటిసి బొక్క జంగారెడ్డి, దేపా భాస్కర్‌రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

పురపాలక చట్టాన్ని సవరించాలి

సిఎంకు రాష్ట్ర మున్సిపల్ చాంబర్స్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రాష్ట్రంలో అమలవుతున్న పురపాలక చట్టాన్ని సవరించాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చాంబర్స్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లోని మున్సిపల్ చాంబర్స్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్వీర్యమైన అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్న రేవంత్‌రెడ్డి పురపాలిక వ్యవస్థ ఉనికికే ప్రమాదకారిగా మారిన 2019లో పురపాలక నూతన చట్టాన్ని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి స్థానిక సంస్థలను కాపాడాలని కోరారు. స్థానిక సంస్థల ప్రాతినిధ్యం నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన రేవంత్‌రెడ్డి సమగ్రమైన పురపాలిక చట్టాన్ని రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం 2019 పురపాలక చట్టం తీసుకొచ్చి స్థానిక సంస్థలను అపహాస్యం చేసిందన్నారు. పురపాలక పాలకవర్గాన్ని ఈ చట్టం వల్ల ఏ అధికారాలు ఉన్నాయో, ఒక్కసారి అధ్యయం చేయాలని కోరారు. రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల పటిష్టత కోసం 73, 74వ రాజ్యాంగ సవరణ చేసి పట్టణాలు, పల్లెల అభివృద్ధికి ఊతమిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం తూట్లు పొడిచిందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలతో అధికారాలన్నీ అధికారులకు అప్పగించి బాధ్యతలను మాత్రమే పాలకవర్గాలకు అప్పగించిందని తెలిపారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలు కేవలం ఉత్సవ విగ్రహాలుగా మారి నిర్వీర్యమయ్యాయన్నారు. ఈ చట్టాలతో స్థానిక సంస్థలపై అధికారాలు, అజమాయిషీలను జిల్లా కలెక్టర్లకు అప్పగించడంతో వారు సామంత రాజుల్లా మారి, వేధింపులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాలు ద్వితీయ శ్రేణి నాయకత్వం ఎదగకుండా ఆర్థికంగా చితికిపోయి వారి పట్ల మరణశాసనంగా మారాయని వాపోయారు. పురపాలక సంఘాలపై అజమాయిషీ కలెక్టర్ల నుంచి సీడీఎమ్ఏకు అప్పగించాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో అమలౌతున్న విధంగా తెలంగాణలో చట్టాలను పున:సమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. పురపాలక సంఘాల చైర్మెన్ పదవులకు నేరుగా ఎన్నికలను నిర్వహించడం వల్ల సమర్థవంతంగా విధులను నిర్వహించే అవకాశం ఉందన్నారు. పురపాలక సంఘాల్లో పదవులకు రెండు పర్యాయాలు రిజర్వేషన్లను యథావిధిగా కొనసాగించాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ప్రభుత్వ నిరంకుశ, అభివృద్ధి నిరోధక చర్యలతో తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేయబడ్డాయని తెలిపారు. గత పదేండ్లలో పురపాలక సంఘాలకు టీడీఎస్ నిధులు విడుదల చేయకపోవడంతో పురపాలక సంఘాలు ఆర్థికంగా చితికిపోయాయన్నారు. పురపాలక సంఘాలను పటిష్టవంతం చేయాలన్న సంకల్పంతో ప్రజాపాలనను అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదేండ్ల నుంచి బకాయి ఉన్న టీడీఎస్ నిధులు రూ.2800 కోట్లను విడుదల చేయడమే కాకుండా అభివృద్ధి, మౌళిక సదుపాలయ కల్పన కోసం మరో రూ.2700 కోట్లు విడుదల చేయడం జరిగిందని గుర్తు చేశారు. పురపాలక సంఘాల్లో స్థానిక పరిస్థితులకనుగుణంగా విద్యుత్ దీపాల నిర్వహణ బాధ్యతలను పురపాలికలకే అప్పగించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పురపాలికల ఉనికినే కోల్పోయే విధంగా విద్యుత్ దీపాల నిర్వహణ బాధ్యతలను ఈఈఎస్ఎల్ ఎనర్జీ ఎఫిసెన్సీ సర్వీసింగ్‌కు అప్పగించిందన్నారు. తక్షణమే దాని నుంచి విముక్తి కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో చాంబర్స్ ప్రతినిధులు జి.ఈశ్వర్, చందు, అల్లంపల్లి నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

నిథమ్ డైరెక్టర్ నియామకంపై హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ టూరిజం,హాస్పిటాలిటీ సంస్థ (నిథమ్) డైరెక్టర్‌గా ప్రొఫెసర్ వి.వెంకటరమణ నియామకాన్ని సవాల్ చేస్తూ సెంటర్ ఫర్ బెటర్ గవర్నెన్స్ (సిబిజి) కోవారెంటో రిట్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. జిఒ నెంబరు 206ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ నేపథ్యంలో హైకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. నిథమ్ డైరెక్టర్‌ను నియమించే అధికారం పూర్తిగా గవర్నింగ్ కౌన్సిల్‌కు మాత్రమే ఉందని సీబీజీ గుర్తు చేసింది. ప్రొఫెసర్ వెంకటరమణకు టూరిజం, హాస్పిటాలిటీ లేదా పర్యాటక రంగాల్లో అనుభవం లేదనీ, గతంలో ఏర్పాటుచేసుకున్న నిథమ్ అర్హతలను పూర్తిగా విస్మరించారనీ, నిథమ్ పూర్తిగా స్వయం సమర్థసంస్థ అని తెలియజేసింది. 2023లోనూ కాగ్ నివేదిక నిథమ్ డైరెక్టర్ నియామకాన్ని తప్పుబట్టిందన్నారు. ప్రభుత్వ నియామకాల్లో పారదర్శకత, ప్రతిభ, నిబంధనలు పాటించాలనేది మాప్రయత్నమని హైకోర్టును ఆశ్రయించిన సిబిజి ప్రతినిధి డాక్టర్ కె చంద్రశేఖర్‌రావు మంగళవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు.

సిఎం బందోబస్తుకు వెళ్లొస్తుండగా ప్రమాదం

- నలుగురు పోలీసులకు గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


బాధిత పోలీసులను పరామర్శిస్తున్న ఎస్‌పి శరత్

సిఎం రేవంత్ రెడ్డి బందోబస్తుకు వెళ్లి తిరిగి వస్తుండగా నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం జువ్విగూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం నారాయణపేట జిల్లా మక్తల్‌లో జరిగిన సిఎం పర్యటన సందర్భంగా నల్లగొండ జిల్లా నుంచి పోలీసులు బందోబస్తుకు వెళ్లారు. అనంతరం తిరిగి నల్లగొండకు వస్తుండగా మంగళవారం ఉదయం జువ్విగూడెం వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. దీంతో వాహనంలో ఉన్న ఏఎస్ఐలు శ్రీధర్, నరసింహారెడ్డి, సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. వారిని వెంటనే నలగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే ఎస్‌పి శరత్ చంద్రపవార్ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. తమ సిబ్బందికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు.

ఒక్కరే నామినేషన్ వేయాలి

- నందిపేట్ మండలం వెల్మల్ విడిసి తీర్మానం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గ్రామంలో ఒక్కరే నామినేషన్ వేయాలని విడిసి తీర్మానించింది. దాంతో ఆ గ్రామానికి చెందిన వార్డు మెంబర్ భోగ రాము అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం వెల్మల్ గ్రామానికి జనరల్ రిజర్వేషన్ వచ్చింది. అయితే గ్రామ సర్పంచ్‌గా పది పంథాలు, 16 కులాల్లో నుంచి ఒక వ్యక్తిని మాత్రమే సర్పంచ్‌గా నామినేషన్ వేయించాలని, ఈ నిబంధనను ఎవరైనా తిరస్కరిస్తే.. అందుకు ఆ పంథా కులం వారే బాధ్యత వహించాలని తీర్మానం చేశారు. దాంతో ఆ గ్రామ మాజీ వార్డు మెంబర్ భోగ రాము ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

సాగులో సరికొత్త రికార్డులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రజాప్రభుత్వ సుస్థిర పాలన, రైతులకు లాభం చేకూర్చే విధానాలు, విస్తరణ ఫలితాలతో రాష్ట్రంలో వ్యవసాయం ఏటేటా విస్తరిస్తోంది. రికార్డులను నెలకొల్పుతూ వరి సాగులో పంజాబ్‌ను దాటేసింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువలో వ్యవసాయం వాటా 6.7 శాతం పెరిగింది. ప్రస్తుత ధరల ప్రకారం వ్యవసాయ రంగం వాటా 2023-24లో రూ.1,00,004 కోట్లు నమోదు కాగా..2024-25 అంచనాల ప్రకారం రూ.1,06,708కు చేరింది. 2023-24 సీజన్‌లో 209.62 లక్షల ఎకరాల్లో అన్ని పంటలు సాగు చేయగా..296.17 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వచ్చింది. 2024-25 సీజన్‌లో సాగు విస్తీర్ణం ఏకంగా 220.77 లక్షలకు పెరిగింది. పంట దిగుబడి 320.62 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. ప్రధాన పంటైన వరి సాగు 2023-24లో 118.11 లక్షల ఎకరాలు కాగా...2024-25లో అది 127.03 లక్షల ఎకరాలకు పెరిగింది.

రక్త సంబంధంపై 'కాసుల' కత్తి..

- ఇన్సూరెన్స్ డబ్బులు రూ.4.14 కోట్ల కోసం అన్నను చంపిన తమ్ముడు
- ముగ్గురు నిందితుల రిమాండ్



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎసిపి విజయకుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డబ్బు.. మనిషిని మృగంగా మారుస్తుంది అనడానికి కరీంనగర్ జిల్లాలో జరిగిన ఈ ఘటనే ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది. పేగుబంధం కన్నా కాసులే ముఖ్యమని భావించిన ఓ తమ్ముడు.. మానసిక స్థితి సరిగ్గా లేని సొంత అన్నపై ఇన్సూరెన్స్ చేయించి.. ఆ డబ్బుల కోసం పక్కా స్కెచ్ వేసి.. అతన్ని టిప్పర్‌తో తొక్కించి చంపేశాడు. ఆ తర్వాత అది ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించాడు. ఈ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కరీంనగర్ కమిషనరేట్‌లో మంగళవారం నిర్వహించిన మీడియాలో సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి..

కరీంనగర్ జిల్లా రామడుగు మండల కేంద్రానికి చెందిన మామిడి నరేష్ షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి రూ.25 లక్షలు పోగొట్టుకున్నాడు. దాంతోపాటు జల్సాలకు అలవాటు పడ్డాడు. టిప్పర్ల ఈఎంఐలు, ఇతరత్రా కలిపి రూ.1.50 కోట్ల అప్పుల్లో కూరుకుపోయాడు. అప్పుల వాళ్ల ఒత్తిడి పెరగడంతో మానసిక పరిపక్వత లేని తన అన్న మామిడి వెంకటేష్ (37)ను చంపేస్తే, ఇన్సూరెన్స్ రూపంలో రూ.కోట్లు వస్తాయని నరేష్ ప్లాన్ వేశాడు.

రూ.4 కోట్ల 'డెత్' ప్లాన్..

హత్యకు ముందే అన్న వెంకటేష్ పేరు మీద ఐసిఐసిఐ, టాటా ఎఐజి, హెచ్‌డిఎఫ్‌సి వంటి సంస్థల నుంచి రూ.4.14 కోట్లు ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకున్నాడు. అన్న చనిపోతే ఇన్సూరెన్స్ డబ్బులతోపాటు, అతని పేరుపై ఉన్న రూ.20 లక్షల గోల్డ్ లోన్ కూడా మాఫీ అవుతుందని లెక్కలు వేసుకున్నాడు. ఈ పనిలో తన స్నేహితుడు నముండ్ల రాకేశ్, టిప్పర్ డ్రైవర్ మునిగాల ప్రదీప్‌ను భాగస్వాములను చేశాడు.

ఆ రాత్రి జరిగింది ఇదే..

గత నెల 29తేదీ రాత్రి 10 గంటల సమయంలో రామడుగు శివారులోని భారత్ పెట్రోల్ పంప్ వద్ద నిర్మానుష్య ప్రాంతంలో ప్లాన్ ప్రకారం డ్రైవర్ ప్రదీప్ మట్టి లోడ్ ఉన్న టిప్పర్‌ను అక్కడికి తెచ్చి, బ్రేక్ డౌన్ అయినట్టు నటించి నరేష్‌కు ఫోన్ చేశాడు. నరేష్ తన అల్లుడు సాయి ద్వారా 'జాకీ పెట్టాలి.. రమ్మని' అన్న వెంకటేష్‌ను పిలిపించాడు. టిప్పర్ ఇంజిన్ ఆన్‌లోనే ఉంది. నరేష్ డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు. అన్న వెంకటేష్ అక్కడికి వచ్చాక.. 'జాకీ టైర్ కింద పెట్టి తిప్పు' అని చెప్పాడు. వెంకటేష్ సెల్‌ఫోన్ లైట్ వెలుతురులో జాకీ తిప్పుతుండగా.. నరేష్ టిప్పర్‌ను ముందుకు పోనిచ్చాడు. భారీ వాహనం టైర్లు వెంకటేష్ శరీరంపై నుంచి వెళ్లడంతో అతను అక్కడికక్కడే ప్రాణం విడిచారు. అనంతరం డ్రైవర్ ప్రదీప్‌ను అక్కడి నుంచి పారిపోమ్మని చెప్పి, దీన్నొక రోడ్డు ప్రమాదంగా నమ్మించే ప్రయత్నం చేశాడు.

ట్విస్ట్ ఇచ్చిన 'అల్లుడి' సాక్ష్యం

డ్రైవర్ ప్రదీప్ యాక్సిడెంట్ చేశాడని నరేష్ నాటకం ఆడాడు. కానీ, అక్కడే ఉన్న నరేష్ అల్లుడు 'సాయి' ఈ దారుణాన్ని కళ్లారా చూశాడు. టిప్పర్ నడిపింది డ్రైవర్ కాదని, తన మామ నరేష్ అని తండ్రి నర్సయ్యకు చెప్పడంతో కథ అడ్డం తిరిగింది. నర్సయ్య ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, నరేష్‌ను తమదైన శైలిలో విచారించగా అసలు నిజం బయట పెట్టినట్టు సిపి గౌష్ ఆలం తెలిపారు. ఈ కేసును ఛాలెంజింగ్‌గా తీసుకున్న పోలీసులు నిందితుల నుంచి హత్య ప్లానింగ్ వీడియో ఉన్న మొబైల్ ఫోన్, ఇన్సూరెన్స్ బాండ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎసిపి విజయకుమార్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్, ఎస్ఐ రాజు బృందం కేవలం మూడు రోజుల్లోనే ఈ కేసును ఛేదించి, ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



విద్యార్థులకు జీవన మార్గం బోధించే వారే గురువులు

ప్రజాశక్తి - కల్చరల్

విద్యార్థులకు కేవలం విద్య మాత్రమే కాక జీవన మార్గం బోధించే వారే గురువులు అని ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె వి రమణ అన్నారు తెలుగు విశ్వవిద్యాలయంలో ఎన్‌టిఆర్ కళా మందిరంలో తెలుగు విశ్వవిద్యాలయం 40వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రఖ్యాత సాహితీ వేత్త ఆచార్య శ్రీ రంగాచార్య కీ 20025, కి గాను విశిష్ట పురస్కారం ప్రదానం సభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని మాట్లాడుతూ పురస్కారం గా లక్ష రూపాయల నగదు ప్రశంసా పత్రం జ్ఞాపిక ప్రదానం చేసి మాట్లాడారు. నల్గొండ జిల్లాలో మారుమూల గ్రామంలో పుట్టి రచనా వ్యాసంగం చేస్తూ మహబూబ్ నగర్ పాలెం ప్రాచ్య కళాశాలలో అధ్యాపక వృత్తిలో ఎందరో విద్యార్థులకి ఆదర్శంగా రంగాచార్యులు నిలిచారని ప్రశంసించారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ పూర్వ అద్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ రంగా చార్య ఎన్నో కావ్యాల పరిస్కృతం చేశారు అని చాటు పద్యాలు చమత్కారంగా చెప్పి పలువురు పండితుల ప్రశంస పొందిన పండితులు అని కొనియాడారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య నిత్యానంద రావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సాహిత్య కళా రంగాల్లో విశేష కృషి చేసిన ఒకరికి పురస్కార్ ప్రదానం చేస్తున్నామని చెప్పారు. ఈ ఏడు పురస్కారం అందుకున్న రంగా చార్య తన గురువు కూడా అని తెలిపారు విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంత రావు అధ్యక్షత వహించగా ఆచార్య రాధా సారంగ పాణి కార్యక్రమం సమన్వయం చేశారు.

గల్ఫ్‌లో ఎఎస్‌బిఎల్ రియాల్టీ మీట్

ప్రజాశక్తి - హైదరాబాద్



నగర కేంద్రంగా పని చేస్తోన్న ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ ఎఎస్‌బిఎల్ తమ గ్లోబల్ విస్తరణ సిరీస్‌లో భాగంగా మధ్యప్రాచ్యంలోనూ ఎన్‌ఆర్‌ఐ రియాల్టీ మీట్‌ను నిర్వహించినట్లు తెలిపింది. ఈ కార్యక్రమం మస్కట్, దోహా, అబుదాబి, దుబాయ్‌లలో జరిగిందని ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇది గల్ఫ్ మార్కెట్‌లోకి ఎఎస్‌బిఎల్ అధికారిక ప్రవేశాన్ని సూచించటంతో పాటుగా గ్లోబల్ ఇండియన్ కమ్యూనిటీలో అంతర్జాతీయ పెట్టుబడులను పెంచే దిశగా ఒక ముఖ్యమైన అడుగు అని ఎఎస్‌బిఎల్ ఫౌండర్, సిఇఒ అజితేష్ కొరుపోలు తెలిపారు. భారతదేశంలో అత్యంత స్థిరమైన రియల్ ఎస్టేట్ మార్కెట్లలో ఒకటిగా హైదరాబాద్ నిరంతర ఎదుగుదలను కలిగి ఉందన్నారు.

బిసిసిఐతో ఏషియన్ పెయింట్స్ జట్టు

హైదరాబాద్ : భారత క్రికెట్‌కు అధికారికంగా కలర్ పార్ట్నర్‌గా బిసిసిఐతో ఏషియన్ పెయింట్స్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఈ ఒప్పందం రాబోయే మూడేళ్ల పాటు పురుషులు, మహిళలు, దేశీయ క్రికెట్‌తో ఉండబోతుందని ఏషియన్ పెయింట్స్ లిమిటెడ్ ఎండి, సిఇఒ అమిత్ సింగ్లే పేర్కొన్నారు. బిసిసిఐతో తమ పార్ట్నర్ షిప్ ఒక ఉత్తేజకరమైన కొత్త అధ్యాయాన్ని సూచిస్తుందన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో అక్రమ దోమ నివారణ ఉత్పత్తులు

- హెచ్ఐసిఎ గౌరవ కార్యదర్శి జయంత్ వెల్లడి

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని అనేక ఇళ్లలో అక్రమ దోమ నివారణ అగరబత్తులు విస్తృతంగా ఉపయోగంలోకి రావడం ప్రధాన ఆందోళనగా మారిందని హోమ్ ఇన్సెక్ట్ కంట్రోల్ అసోసియేషన్ (హెచ్ఐసిఎ) గౌరవ కార్యదర్శి జయంత్ దేశ్‌పాండే పేర్కొన్నారు. స్లీప్‌వెల్ వంటి పేర్లతో విక్రయిస్తున్న ఈ ప్రమాదకర ఉత్పత్తుల్లో మెపర్‌ఫ్లూత్రిన్ వంటి రసాయనాలు ఉన్నాయని ఆయన ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఇవి సెంట్రల్ ఇన్సెక్టిసైడ్స్ బోర్డ్ అండ్ రిజిస్ట్రేషన్ కమిటీ (సిఐబిఆర్‌సి) ద్వారా ఆమోదం లేదన్నారు. ఈ అక్రమ తయారీదారులపై వ్యవసాయ శాఖ తీసుకున్న కఠిన చర్యలు అభినందనీయమన్నారు. ఇటీవల ఎపిలో అధికారులు రూ.69.24 లక్షల విలువైన ప్రమాదకర అగరబత్తులను స్వాధీనం చేసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ నుంచి సేకరించిన అగర్‌బత్తి నమూనాలపై హెచ్ఐసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్లో మెపర్‌ఫ్లూత్రిన్ ఉన్నట్లు గుర్తించారన్నారు.

ఎలెక్టా నుంచి కాన్సర్ కేర్ ఎఐ ఆధారిత ఇఒ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్

ఎలెక్టా తన అత్యాధునిక లీనియర్ యాక్సిలరేటర్ (లినాక్) క్యాన్సర్ కేరక కోసం కొత్తగా ఇవో పరికరాన్ని భారత మార్కెట్లోకి విడుదల చేసినట్లు తెలిపింది. క్యాన్సర్ చికిత్సలో అత్యంత కీలకమైన ఈ పరికరాన్ని ఇప్పటికే యూరప్, ఇతర ప్రాంతాల్లో అందుబాటులోకి తెచ్చినట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. హై డెఫినిషన్ ఎఐ-మెరుగుదల ఇమేజింగ్‌తో అనుకూల రేడియేషన్ థెరపీ సామర్థ్యాలను దేశవ్యాప్తంగా వైద్యులకు అందుబాటులోకి తెస్తున్నట్లు ఆ సంస్థ ఇండియా సబ్‌కాంటినెంట్ హెడ్ శంకర్ శేషద్రి తెలిపారు. భారతదేశ రేడియోథెరపీ రంగానికి అత్యాధునిక సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది రోగులకు అత్యంత నాణ్యమైన క్యాన్సర్ చికిత్సను అందుబాటులోకి తీసుకురావడం పట్ల ఎలెక్టా నిబద్ధతను బలోపేతం చేయడమే తమ లక్ష్యమన్నారు.

సామాజిక అసమానతలపై ధిక్కార స్వరం ఈశ్వరి బాయి

- శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్‌రావు
- మంత్రి సీతక్కకు సత్కారం

ప్రజాశక్తి - కల్చరల్

ఈశ్వరీ బాయి వ్యక్తి కాదు మహా శక్తి అని శాసన సభ సభా పతి గడ్డం ప్రసాద్ రావు అభివర్ణించారు సామాజిక అసమానతలపై ధిక్కార స్వరం ఈశ్వరి బాయి అన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఈశ్వరీ బాయి మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహణలో ఈశ్వరి బాయి 107 వ జయంతి సందర్భంగా ఆమె పేరిట ఏర్పాటు చేసిన పురస్కారం పంచాయతీ రాజ్ శాఖా మంత్రి సీతక్కకు ప్రదానోత్సవం సభ జరిగింది. ముఖ్య అతిథిగా ప్రసాద రావు పాల్గొని గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి సీతక్కకు పురస్కారం బహుకరించి మాట్లాడారు. ఈశ్వరి బాయి అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా దళితుల హక్కులకోసం పోరాడిన ధీర వనిత అని అన్నారు. సామాజిక న్యాయం ధ్యేయంగా ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. మహిళలు ఈశ్వరి బాయినీ ఆదర్శంగా తీసుకుని రాజకీయాలలోకి ఎక్కువ మంది రావాలని సూచించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ నాడు ఈశ్వరి బాయి ఫైర్ బ్రాండ్‌గా అసెంబ్లీలో పేరు తెచ్చుకున్నారని. ప్రస్తుతం సీతక్క ఆ గుర్తింపు పొందారని అభినందించారు. మహిళా సాధికారతకు సీతక్క నమూనా అన్నారు. పురస్కారం అందుకున్న సీతక్క మాట్లాడుతూ ఈశ్వరి బాయికి లేదా దళిత బహు జనులకు అంబేద్కర్ ఆదర్శమని అన్నారు. ఆయన అందించిన రాజ్యాంగం కారణంగానే అడవి బాట పట్టిన తాము విద్యావంతులమై ప్రజా జీవితానికి వచ్చి ప్రజా ప్రతినిధి అయ్యానని చెప్పారు. కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్‌ను కాదు దేవుడిని నమ్మమనీ చెప్పారని, ఎవరూ బలవంతంగా ఎవరిని ఒప్పించలేరని, అది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ట్రస్ట్ స్థాపకురాలు డాక్టర్ గీతా రెడ్డి అధ్యక్షత వహించిన వేదికపై ప్రొఫెసర్ స్వామి దళిత ఉద్యమ నాయకుడు జె బి రాజు కార్పొరేటర్ విజయ రెడ్డి, సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య, నిర్మలా, జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వ్యాఖ్యాత సుజాత ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్క పంపిన సందేశం చదివారు.


సీతక్కను సత్కరిస్తున్న గడ్డం ప్రసాద్‌రావు



చట్టబద్ధంగానే బాచుపల్లి వాసవి అర్బన్ ప్రాజెక్ట్

- గడువులోగా కష్టమర్లకు అందిస్తాం : అభిషేక్

ప్రజాశక్తి - హైదరాబాద్

తాము బాచుపల్లిలో చేపట్టిన వాసవి అర్బన్ ప్రాజెక్ట్‌ను చట్టబద్ధంగానే నిర్మిస్తున్నామని ప్రముఖ రియాల్టీ కంపెనీ వాసవి గ్రూప్ వెల్లడించింది. ఇటీవల ఇటీవల కొందరు కస్టమర్లు చేపట్టిన నిరసనల నేపథ్యంలో ఆ సంస్థ వివరణ ఇచ్చింది. అమ్మకపు ఒప్పందాల ప్రకారం ప్రాజెక్ట్ మొదటగా నిర్ణయించిన హ్యాండోవర్ గడువు డిసెంబరు 2024 కాగా.. జూన్ 2025 వరకు గ్రేస్ పీరియడ్ ఉందని వాసవి గ్రూపు మనేజింగ్ డైరెక్టర్ అభిషేక్ తెలిపారు. కోవిడ్-19 ప్రభావాలు, కొన్ని బ్లాక్లపై కొనసాగిన దీర్ఘకాల న్యాయపరమైన కేసుల వల్ల ఏర్పడిన ఫోర్స్ మేజర్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) ఈ ప్రాజెక్ట్కు నమోదు గడువు పొడిగింపును మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం ఈ గడువు 03 ఆగస్టు 2026 వరకు చెల్లుబాటు అవుతుంతదన్నారు. అందువల్ల సవరించిన ప్రాజెక్ట్ షెడ్యూల్ చట్టపరంగా పూర్తి చేస్తామన్నారు. ప్రాజెక్ట్ స్థలంలో నిర్మాణ పనులు సక్రమంగా కొనసాగుతున్నాయన్నారు. బ్లాక్-9లో నిర్మాణ పనులు 100 శాతం పూర్తయ్యాయన్నారు. బ్లాక్-8 న్యాయపరమైన కేసుల కారణంగా భారీగా ఆలస్యమయ్యిందని అంగీకరించారు. ఈ అంశాన్ని కస్టమర్లకు ముందుగానే తెలిపామన్నారు. 2025 నవంబర్ 28 నాటికి కస్టమర్లకు బ్లాక్ వారీగా ఫిట్ అవుట్ హ్యాండోవర్, జిహెచ్ఎంసి ఆక్యుపెన్సీ సర్టిఫికేట్‌లను అధికారింగా అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

మూగ బాలుడిపై వీధి కుక్కల దాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ శివగంగ కాలనీలో మంగళవారం దారుణం జరిగింది. ఇంటి ముందు ఆడుకుంటున్న ఒక మూగ బాలుడిపై వీధికుక్కలు తీవ్రంగా దాడి చేసి గాయపర్చాయి. ఈ దాడిలో బాలుడి కుడి చెవి పూర్తిగా తెగిపోవడంతోపాటు తల, నడుము, వీపు భాగాల్లో లోతైన గాయాలు ఏర్పడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లాకు చెందిన తిరుపతిరావు, చంద్రకళ దంపతులు మూడేళ్ల కిందట నగరానికి వలస వచ్చారు. కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వారి కుమారుడు ప్రేమ్‌చంద్ పుట్టుకతోనే మూగవాడు. మంగళవారం తల్లి ఇంట్లో పని చేసుకుంటుండగా బాలుడు ఆడుకోవడానికి బయటకు రావడంతో ఒక్కసారిగా సుమారు పది వీధి కుక్కలు దాడి చేశాయి. అతని తల, నడుము, కుడి చెవి, వీపు భాగాలను కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆ బాలుడిని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం నీలోఫర్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ఫుడ్ పాయిజన్

- 15 మందికి అస్వస్థత.. ఒక పరిస్థితి విషమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


చికిత్స పొందుతున్న విద్యార్థి

ఫుడ్ పాయిజన్ అయ్యి 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన గద్వాల జిల్లా కేంద్రం బీమ్‌నగర్‌లోని ఎస్‌టి హాస్టల్‌లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. ఎస్‌టి హాస్టల్‌లో 128 మంది విద్యార్థులున్నారు. మంగళ వారం ఉదయం అల్పాహారం, అరటి పండ్లు, బిస్కెట్లు తిన్న తర్వాత విద్యార్థులు పాఠశాలకు వెళ్లారు. అరగంట అనంతరం 15 మంది విద్యార్థులకు వాంతులు కావడంతో వారిని ఆస్పత్రికి తరలించారు. ఉదయం పెట్టిన ఉప్మాలో పురుగులు వచ్చాయని పలువురు విద్యార్థులు తెలిపారు. కొద్దిసేపటికి కడుపు నొప్పితోపాటు వాంతులు అయ్యాయన్నారు. దాంతో హాస్టల్ సిబ్బంది విద్యార్థులను వెంటనే గద్వాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసులు తెలిపారు.



ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగానికి రాజీనామా

- సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఆఫీస్ సబార్డినేట్ ఐతగోని వెంకటయ్య ఉద్యోగానికి రాజీనామా చేసి మంగళవారం కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. రాజీనామా లెటర్‌ను స్థానిక ప్రాథమిక వ్యవసాయ కార్యాలయంలో అందజేశారు. అతని రాజీనామాను పెద్దవూర పిఎసిఎస్ సంఘ కార్యవర్గం ఆమోదించిందని, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నవంబర్ 29 నుంచి ఐతగోని వెంకటయ్యను విధుల నుంచి తొలగించినట్టు పిఎసిఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. అందుబాటులో ఉండి గ్రామంలో సమస్యలను నిజాయితీగా, బాధ్యతగా పరిష్కరిస్తామన్నారు. ఈ నెల 14న జరుగనున్న ఎన్నికలో ఓటు ద్వారా తనను ఆశీర్వదించాలని కోరారు.

మావోయిస్టు నేత లొంగుబాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దండకరణ్య స్పెషల్ జోనల్ కమిటీ సౌత్ బస్తార్ పరిధిలోని మావోయిస్టు చైతన్య నాట్య మంచ్ నాయకుడు లోకేటి రమేశ్ అలియాస్ అశోక్ అలియాస్ ఎ నరేందర్ అలియాస్ ఏ. రాజేశ్వర్ మంగళవారం జనగామ పోలీసుల ముందు లొంగిపోయారు. ఈ సందర్భంగా జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అనారోగ్య సమస్యలు, భద్రతా దళాల నిరంతర ఒత్తిడి, తదితర కారణాలతో రమేశ్ లొంగిపోయినట్టు తెలిపారు. లోకేటి రమేశ్.. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇస్రోజీవాడకు చెందిన లోకేటి రమేశ్.. రెండు దశాబ్దాలుగా సౌత్ బస్తర్ ప్రాంతంలో నిషేధిత సిపిఐ(మావోయిస్టు)లో పని చేసినట్టు చెప్పారు. రమేష్ పై రూ.8 లక్షల రివార్డు ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పిలుపుమేరకు మావోయిస్టులందరూ జనజీవన స్రవంతిలో కలవాలని డిసిపి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జనగామ ఎసిపి పండరి చేతన్ నితిన్, స్టేషన్‌ఘన్‌పూర్ ఎసిపి భీమ్ శర్మ, జనగామ సీఐ సత్యనారాయణ రెడ్డి, రఘునాథ్‌పల్లి సిఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దుబ్బ రూప కుటుంబానికి అండగా ఉంటాం

- ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన రాష్ట్ర మహిళ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. మంగళవారం గాంధీ భవన్‌లో మహిళ కాంగ్రెస్ అధ్యక్షులు సునీతారావ్ ఆధ్వర్యంలో దుబ్బ రూప కూతురు సాత్విక కాంగ్రెస్ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా ఆమెతో మాట్లాడి కుటుంబ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. పార్టీ పరంగా అన్ని రకాలుగ ఆదుకుంటామని తెలిపారు.

భూకుంభకోణంపై 'బిఆర్ఎస్ పోరుబాట'

- హిల్ట్ పాలసీతో నిజనిర్ధారణ కోసం క్షేత్రస్థాయికి : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మహానగర పరిధిలో రూ.ఐదు లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను, 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ' (హిల్ట్) పేరుతో చేసే భూకుంభకోణంపై భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పోరుబాటకు సిద్ధమైంది. ఆ పాలసీ వల్ల ప్రజలకు కలిగే నష్టంపై నిజనిర్ధారణ కోసం క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని నిర్ణయించింది. పారిశ్రామికవాడల్లో పర్యటించడం కోసం బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ నాయకులతో కూడిన 'నిజనిర్ధారణ బృందాలను' ఏర్పాటు చేశారు. ఈ మేరకు పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కెటిఆర్ మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయి పర్యటనలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపన కోసం, ఉపాధి కల్పన కోసం అతి తక్కువ ధరకే కేటాయించిన భూములను, ఇప్పుడు 'మల్టీ యూజ్ జోన్' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మారుస్తున్నారని ఆరోపించారు. సుమారు 9,300 ఎకరాల భూములను మార్కెట్ విలువ కంటే అతి తక్కువకు 30 శాతానికే రెగ్యులరైజ్ చేసి, సుమారు రూ.ఐదు లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని విమర్శించారు. పేదలకు ఇళ్లు కట్టడానికి, కనీసం స్మశాన వాటికలకు కూడా స్థలాలు లేవంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, రూ.వేల కోట్ల విలువైన భూములను మాత్రం ప్రయివేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందన్నారు.

నేడు, రేపు పారిశ్రామిక వాడల్లో బృందాల పర్యటన

ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక వాడలను ఎనిమిది క్లస్టర్లుగా విభజించి, పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో బృందాలు బుధ, గురువారాల్లో పర్యటించనున్నాయని కేటీఆర్ వివరించారు. అక్కడ స్థానిక నాయకులు, ప్రజలను కలుపుకుని వాస్తవ మార్కెట్ విలువకు, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఉన్న భారీ వ్యత్యాసాన్ని ప్రజల ముందు ఉంచుతారని చెప్పారు. క్లస్టర్-1లో మాజీమంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో గంగుల కమలాకర్, దేశపతి శ్రీనివాస్, మెదక్ ఎమ్మెల్యేల బృందం పాశమైలారం, పటాన్‌చెరు, రామచంద్రాపురం ప్రాంతాలను సందర్శిస్తారని అన్నారు. క్లస్టర్-2లో మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, సురభి వాణీదేవి, ఉప్పల్ నాయకులు కలిసి నాచారం, మల్లాపూర్, ఉప్పల్, చర్లపల్లి ప్రాంతాల్లో పర్యటిస్తారని వివరించారు. క్లస్టర్-3లో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, రవీందర్‌రావులు మౌలాలి, కుషాయిగూడ పారిశ్రామిక వాడలను సందర్శిస్తారని చెప్పారు. క్లస్టర్-4లో తనతోపాటు సత్యవతి రాథోడ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానందతో కలిసి జీడిమెట్ల, కూకట్‌పల్లి ప్రాంతాల్లో పర్యటిస్తామన్నారు. క్లస్టర్-5లో తలసాని శ్రీనివాస్ యాదవ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, నవీన్ రావులు సనత్ నగర్, బాలానగర్ ప్రాంతాలను పరిశీలిస్తారని చెప్పారు. క్లస్టర్-6లో మాజీమంత్రి చామకూర మల్లారెడ్డి, శంభీపూర్ రాజు కలిసి మేడ్చల్ ఇండస్ట్రియల్ పార్కుకు వెళ్తారని అన్నారు. క్లస్టర్-7లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, స్వామిగౌడ్, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి కలిసి కాటేదాన్, హయత్‌నగర్‌లో పర్యటిస్తారని వివరించారు. క్లస్టర్-8లో మాజీమంత్రి మహమూద్ అలీ, దాసోజు శ్రవణ్, ఎండీ సలీం, చందులాల్ కలిసి బారాదరి పారిశ్రామిక వాడను సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తారని చెప్పారు.

తనవారే ప్రత్యర్థికి మద్దతిస్తున్నారని సర్పంచ్ అభ్యర్థి ఆత్మాహత్యాయత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుటుంబ సభ్యులే తనకు మద్దతు ఇవ్వకుండా.. ప్రత్యర్థికి మద్దతిస్తున్నారని మనస్థాపానికి గురైన ఓ సర్పంచ్ అభ్యర్థి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఘనపురం గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఘనపురంకు చెందిన మాజీ ఉప సర్పంచ్ గణపురం ఎల్లయ్య సర్పంచ్ పదవికి నామినేషన్ వేశాడు. అయితే తన కుటుంబ సభ్యులు తనకు మద్దతు ఇవ్వకుండా ప్రత్యర్థికి మద్దతు ఇస్తున్నారని తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో తన సోదరుడి ఇంటి వద్ద గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సిద్దిపేట ఏరియాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

భార్య మరణాన్ని భరించలేక భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనుమానాస్పద స్థితిలో భార్య మృతి చెందడంతో మనస్థాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలం బర్దిపూర్ గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. బర్దిపూర్‌కు చెందిన దంపతులు గంగారం శ్రీశైలం (40), మంజుల (35).. మధ్య కొంతకాలంగా తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నెల క్రితం కూడా ఇలాగే గొడవకావడంతో కుటుంబీకులు, బంధువులతో కలిసి టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహించి సర్ది చెప్పి పంపారు. కాగా, సోమవారం మళ్లీ వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. దాంతో శ్రీశైలం బయటికి వెళ్లిపోయాడు. తిరిగి రాత్రి ఇంటికి వచ్చేసరికి భార్య మంజుల అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉంది. మనస్తాపంతో శ్రీశైలం సైతం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానికులు అనుమానిస్తున్నారు. విషయం తెలుసుకున్న అల్లాదుర్గం, టేక్మల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాలకు పంచనామ నిర్వహిం చారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.